క్లుప్తంగా

భోగేశ్వరం భక్తజన సంద్రం



భోగేశ్వరుడికి పూజలు చేస్తున్న భక్తులు

గడివేముల: ఓం నమఃశివాయ.. హరహర మహాదేవ శంభో శంకర. .ఓం శ్రీ భోగేశ్వర స్వామి అంటూ భక్తుల నామస్మరణతో భోగేశ్వర క్షేత్రం మార్మోగింది. దేవీ నవరాత్రుల ప్రారంభం మొదటి సోమవారం కావడంతో మండల పరిధిలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన శ్రీదుర్గా భోగేశ్వర క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. వందలాది మంది భక్తుల రాకతో ఆలయ ప్రాంగణాలు కళకళలాడాయి. భక్తులు ఆలయ ప్రాంగణంలోని పంచ కోనేర్ల పుణ్యస్నానాలు ఆచరించి స్వామి వారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు చేశారు. ఆలయ ప్రధానాచార్యకులు శ్యాంసుందర్‌శర్మ భక్తులకు ఆలయ విశిష్టతను వివరించారు. భక్తులకు కాశిరెడ్డి నాయన సత్రంలో అన్నప్రసాదాలు అందజేశారు. ఈఓ చంద్రశేఖరరెడ్డి, చైర్మన్ సునీల్‌కుమార్‌రెడ్డి, ధర్మకర్తలు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

బీమా తక్షణ సాయం అందజేత



వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందిస్తున్న కార్పొరేటర్

కల్లూరు: వైఎస్సార్ బీమా పథకం బాధిత కుటుంబానికి భరోసా ఇస్తుందని కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. సోమవారం కల్లూరు అర్బన్ 29వ వార్డు శరీన్‌నగర్ 72వ వార్డు సచివాలయం పరిధిలోని ఫారూఖ్ మృతి చెందాడు. మృతునికి వైఎస్సార్ బీమా నమోదై ఉండటంతో తక్షణ సాయం కింద భార్య షబానాకు రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. మిగతా బీమా సొమ్ము త్వరలోనే నామినీ బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని చెప్పారు. వెల్ఫేర్ సెక్రటరీ రాహుల్, హుస్సేన్ ఆలం తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి



పోస్టర్లను విడుదల చేస్తున్న దూదేకుల నాయకులు

గడివేముల: గుంటూరులో ఈ నెల 29న హక్కుల సాధన కోసం నిర్వహించే దూదేకుల ముస్లిం సింహగర్జనను విజయవంతం చేయాలని గడివేముల మండల దూదేకుల అసోసియేషన్ అధ్యక్షుడు జమాల్ బాషా, కార్యదర్శి డి.సోఫీసాహెబ్ పిలుపునిచ్చారు. స్థానిక కొత్త బస్టాండ్ వద్దనున్న దూదేకుల సంఘం కార్యాలయంలో సోమవారం చలో గుంటూరుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశా రు. వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో 20 లక్షలకు పైగా దూదేకుల జనాభా ఉందని, దామాషా ప్రకా రం చట్టసభల్లో అన్ని రాజకీయ పార్టీలు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. నూర్ బాషా ముస్లిం కులస్తులకు చట్టసభలలో అవకాశం కల్పించే రాజకీయ పార్టీకే సంపూర్ణ మద్దతు ఇస్తామని తెలియజేశారు. గడివేముల దూదేకుల అసోసియేషన్ నాయకులు మహబూబ్ బాషా, డి.సుభాన్, యాసిన్ బాషా, చాంద్ బాషా, దస్తగిరిలు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కర్నూలు (సిటీ): నగరంలోని మౌర్యా ఇన్ సర్కిల్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. బషీర్ అహ్మద్ (60) వెంకటరమణ కాలనీలో నివాసముంటున్నాడు. ఈయన పాతబస్టాండ్‌లో ఓ దుకాణంలో గుమాస్తాగా పనిచేస్తున్నాడు. రాత్రి విధులు ముగించుకుని ఇంటికి తిరిగి వచ్చే సందర్భంలో ఆదివారం రాత్రి 11:30 గంటల సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని గాయాలతో పడివుండగా స్థానికులు గమనించి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. మృతుడికి భార్య శాలిబీ, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

నేడు వైద్య శిబిరాలు

పాణ్యం: మండల పరిధిలోని కౌలురు సచివాలయం-1 పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు మద్దూరు పీహెచ్‌సీ డాక్టర్ సునీత తెలిపారు. ఉదయం 8 గంటలకు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ప్రారంభమవుతుందన్నారు. ఇప్పటికే టోకెన్లు అందుకున్న వారు, అందుకోని వారు సైతం శిబిరంలో వైద్య చికిత్సలు పొందవచ్చని తెలిపారు. వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సి.బెళగల్: మండలపరిధిలోని ఇనగండ్ల గ్రామ ప్రాథమిక పాఠశాల ఆవరణలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రజల చెంతకే మెరుగైన వైద్యం

● ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

సి..బెళగల్: ప్రజల చెంతకే మెరుగైన వైద్య సేవలను చేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే చెందుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. సోమవారం మండలంలోని కొత్తకోట సచివాలయం - 2 (ఈర్లదిన్నె)లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం వైద్య సేవలను ప్రజలను అడిగి వారు తెలసుకున్నారు. డాక్టర్లు మిథున్‌రెడ్డి, అనిల్, శ్రావని, రంజిత్ నాయక్, సంపత్ పాల్గొని 278 మందికి పరీక్షలు నిర్వహిచి వైద్యం చేశారు. అవసరమైన వారికి వైద్యులతో కలిసి ఎమ్మెల్యే మందులు, కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యుడు నడిపి సోమన్న, జేసీఎస్ మండల కన్వీనర్ సీబీ తుల సిరెడ్డి, నాయకులు క్రిష్ణారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, సోమన్న, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గోరంట్లలో..

కోడుమూరు రూరల్: మండలంలోని గోరంట్ల గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ సందర్శించి ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై డాక్టర్లతో మాట్లాడారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దకే మెరుగైన వైద్యసేవలందుతున్నాయని ఎమ్మెల్యే అన్నారు. ప్రజలంతా సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. పలువురు వైద్యులు హాజరై 520 మందికి వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో సర్పంచు బాలక్రిష్ణ, ఎంపీటీసీ రవి, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ ప్రభాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌యాదవ్, స్థానిక నేతలు వేణుగోపాల్, గిడ్డయ్య, మనోహర్, ప్రతాప్‌రెడ్డి, బలరాం, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



ఈర్లదిన్నె జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్‌లో వృద్ధుడిని పరీక్షిస్తున్న డాక్టర్

జూలకల్‌లో..

గూడూరు రూరల్: మండలంలోని జూలకల్‌లో సోమవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే సుధాకర్ సందర్శించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఆరోగ్యాన్ని మెరుగు పరిచేందుకు ఆరోగ్య శ్రీ , 104, హెల్త్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాలు చేపట్టారన్నారు. ప్రస్తుతం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాల ద్వారా వైద్యాన్ని మరింత చేరువ చేశారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కల్లపరి విద్యావతి, గూడూరు నగర పంచాయతీ వైస్ చైర్మన్ పీఎస్ అస్లామ్, జ్ఞాన దేవరెడ్డి, లక్ష్మికాంతారెడ్డి, దామోదరరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రాముడు, ఏలియా, లక్ష్మన్న, దావీద్, ఎంపీడీఓ మాధవీలత పాల్గొన్నారు.



గోరంట్లలో వైద్య సేవలపై ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

కర్నూలు సిటీ: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వం లక్ష్యమని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. సోమవారం కర్నూలు మండల పరిధిలోని ఆర్.కె దుద్యాల గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయస్సులోనే గుండెపోటుకు గురై ప్రాణాలు కోల్పోతున్నారని, ఇకపై ఎవరై ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. మద్యం, బీడీ, సిగరెట్లకు దూరంగా ఉంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఈసీజీ, బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పలువురు డాక్టర్లు పాల్గొని ప్రజలకు వైద్య సేవలు అందించారు. మందులు, కళ్లద్దాలు పంపిణీ చేశారు. అవసరమైన వారిని ఆరోగ్యశ్రీ ఆస్పత్రులకు రెఫర్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు ప్రసన్నకుమార్, జి.శింగవరం ఆదాము, ఆర్.కొంతలపాడు మద్దిలేటి, స్థానిక నాయకులు సూర్య, సునీల్, మారెన్న, ఆనందం, సవారి, హనోక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధాకర్

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



బొల్లవరంలో చేతుల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కల్లూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ అధికారి హేమలత అన్నారు. సోమవారం కల్లూరు మండలం బొల్లవరం గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆమె పరిశీలించారు. అలాగే చేతుల పరిశుభ్రతపై ఫ్లిప్ బుక్ ద్వారా అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ.. పేదలందరికీ మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. వాతావరణంలో మార్పుల వల్ల వచ్చే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని, ఇంటిని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎంపీడీఓ జీవీ రమణ మూర్తి, ఈఓఆర్డీ రవికిషోర్, పీహెచ్‌సీ వైద్యాధికారులు, స్పెషల్ డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు 331 క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు సోమవారం నాడు డ్యాం అధికారులు పేర్కొన్నారు. రిజర్వాయర్‌లో 0.751 టీఎంసీల నీరు నిల్వ ఉందని, ఇన్‌ఫ్లో నిలిచిపోయిందని వారు తెలిపారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

● డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ సలీమ్‌బాష పిలుపు

కర్నూలు(అగ్రికల్చర్): స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు తమ కుమార్తెలకు బాల్యవివాహాలు చేయకుండా చూడాలని డీఆర్‌డీఏ-వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ సలీమ్‌బాషా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ-వైకేపీ కార్యాలయంలో బాల్య వివాహ రహిత భారతదేశమే తమ లక్ష్యం అంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై పొదుపు మహిళలకు గ్రామ, మండల, జిల్లా స్థాయి సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, సెర్ప్ సీఈఓ ఆదేశించారన్నారు. పదేళ్ల క్రితంతో పోలిస్తే ప్రస్తుతం బాల్య వివాహాలు బాగా తగ్గాయన్నారు. పేదరికం కారణంగా గ్రామీణులు తమ బిడ్డలకు చిన్న వయస్సులోనే పెళ్లిళ్లు చేసి బరువు తగ్గించుకోవాలనే లక్ష్యంతో ఉన్నారని, ఇటువంటి వారిలో చైతన్యం తీసుకరావాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకొని పేదరికం నుంచి బయటపడాలని సూచించారు. ఆడపిల్లలను ఉన్నత చదువులు చదివించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆదనపు పీడీ శ్రీధర్‌రావు, డీఆర్‌డీఏ పరిపాలనాధికారి షరీఫ్, డీపీఎంలు నరసమ్మ, అయ్యమ్మ, అనిల్‌కుమార్ ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

సి.బెళగల్: బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తహసీల్దార్ శేషఫణి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో డీఆర్‌డీఏ వైకేపీ ఏపీఎం వెంకటస్వామి బాల్య వివాహాల నిర్మూలనపై స్వయం సహాయక సంఘాల సభ్యులతో ప్రమాణం చేయించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాముడు తదితరులు మాట్లాడుతూ.. బాలల భద్రతే దేశ భద్రత అని, బాలలు, బాలికలకు చిన్న వయస్సులో వివాహాలు చేస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. వైకేపీ సీసీలు, పొదుపు మహిళలు ఉన్నారు.

గూడూరు: బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని, వాటిని పూర్తిగా నిర్మూలించాలని సోమవారం పట్టణంలో పొదుపు మహిళలు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. వైకేపీ, మెప్మా ఆధ్వర్యంలో మహిళలకు సదస్సు నిర్వహించారు. నగర పంచాయతీ కార్యాలయం, వైకేపీ కార్యాలయంలో సదస్సులు నిర్వహించి బాల్య వివాహాలను నిరోధిస్తామని ప్రతిజ్ఞ చేశారు. వైకేపీ ఏపీఎం సుధాకర్, మహిళా సమాఖ్య ప్రెసిడెంట్ సులోచనమ్మ, నగర పంచాయితీ కార్యాలయంలో జరిగిన సదస్సులో మెప్మా సీఎంఓ సూర్యనారాయణ, ఐసీడీఎస్ సిబ్బంది, ఆర్పీలు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ సలీమ్‌బాషా

సాంకేతిక నైపుణ్యం మెరుగుపర్చుకోవాలి

పాణ్యం: విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యం మెరుగుపర్చేలా బోధన చేయాలని ఐబీఎం సంస్థ అడ్వైజర్ చేకూరి రోహిత్ సూచించారు. సోమవారం స్థానిక ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రొగాంపై శిక్షణ ఇచ్చారు. ఏఐసీటీఈ అండ్ లెర్నింగ్ అటల్ సహకారంతో ఈ శిక్షణ నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 16 నుంచి 25వ తేదీ వరకు ఆర్టిఫియల్ ఇంటెలిజెన్స్ అనే అంశంపై రాష్ట్రంలోని అన్ని కళాశాలలకు చెందిన 50 మంది అధ్యాపకులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పొందిన వారు మారతున్న కాలనుగుణంగా విద్యారుర్థులకు నూతన సాంకేతిక అంశాలను బోధిస్తూ వారు ఉన్నత శిఖరాలకు చేరుకునేలా కృషి చేయాలన్నారు. డీన్ అశోక్‌కుమార్, హెచ్‌ఓడీ మల్లికార్జున, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చేకూరి రోహిత్

బైక్ అదుపుతప్పి యువకుడి దుర్మరణం


కల్లూరు: ఉలిందకొండ పోలీసుస్టేషన్ పరిధి 44వ జాతీయ రహదారి తడకనపల్లె క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. ఉలిందకొండ ఎస్‌ఐ నల్లప్ప తెలిపిన వివరాలు.. అనంతపురం టౌన్‌కు చెందిన నూర్ మహమ్మద్ (23) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. కంపెనీ వారు మూడు నెలల పాటు వర్క్ ఫ్రం హోం ఇవ్వడంతో సోమవారం తెల్లవారుజామున తన బైక్‌పై హైదరాబాద్ నుంచి సొంత ఊరికి బయలుదేరాడు. మార్గమధ్యం తడకనపల్లె క్రాస్ వద్దకు వచ్చే సరికి బైక్ వేగాన్ని అదుపు చేసుకోలేక డివైడర్‌ను ఢీ కొట్టాడు. కిందపడిన నూర్ మహమ్మద్ దాదాపు 10 మీటర్లు ఈడ్చుకుంటూ వెళ్లడం వల్ల తల, చంక వద్ద బలమైన రక్తగాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి షేక్ షేక్షావలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.



మృతి చెందిన నూర్ మహమ్మద్

గ్రీన్‌కో పరిశ్రమకు భూముల కేటాయింపు

గడివేముల: మండల పరిధిలోని చెనకపల్లె గ్రామ పరిధిలోని వివిధ సర్వే నంబర్లలో భూములను సోలార్, విండ్ పవర్ సంస్థలకు కేటాయించినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు సోమవారం తెలిపారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. నంద్యాల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చెనకపల్లె గ్రామంలో అన్ సర్వేడ్ హిల్ బ్లాక్ (ఉపయోగకరం లేని) భూములను 1202.12 ఎకరాలను గ్రీన్‌కో ఎనర్జీ పరిశ్రమకు కేటాయించినట్లు వివరించారు. ఈ నెల 12వ తేదీన ఏ1 నోటీసును ఓండుట్ల సచివాలయం వద్ద ప్రదర్శించినట్లు చెప్పారు. గ్రీన్‌కో పరిశ్రమకు భూముల కేటాయింపుపై ఆక్షేపణలు ఉంటే స్థానిక సచివాలయంలో లేదా తహసీల్దార్ కార్యాలయంలో ఈ నెల 27వ తేదీలోపు ఫిర్యాదులు అందజేయాలన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

భూసేకరణ వివరాలు

సర్వే నంబర్	పూర్తి భూవిస్తీర్ణం (ఎకరాలు)	కేటాయించిన భూవిస్తీర్ణం (ఎకరాలు)
79	298.31	298.31
792	417.22	417.22
793	301.96	301.96
794	174.83	174.83
795	3.72	3.72
796	0.77	0.77
797	5.31	5.31

అర్హులందరికీ సంక్షేమం.. ప్రభుత్వ ధ్యేయం

పాణ్యం: గ్రామాల్లో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చిందని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం పాణ్యం మండలం ఆలమూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం లబ్ధిదారులకు చేరవేయడంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బందే కీలకమన్నారు. చిన్నచిన్న సాంకేతిక సమస్యలను దృష్టిలో ఉంచుకొని దరఖాస్తులను తిరస్కరించొద్దని సూచించారు. అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందాలన్నదే సీఎం జగనన్న లక్ష్యం అని, ఆయన ఆశయానికి తగ్గట్టు ప్రతి వలంటీర్, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పని చేయాలన్నారు. అందరి సహకారంతో గ్రామాన్ని ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేయాలన్నారు.

అంతర్గత రోడ్డు పూర్తి చేయండి

గ్రామంలోని బోయపేట, బస్టాండ్, కొత్త బిల్డింగ్‌లో మట్టి రోడ్ల స్థానంలో సీసీ రోడ్లు నిర్మించాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అధికారులకు సూచించారు. పనులు త్వరగా ప్రారంభించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. అలాగే బస్టాండ్‌లో మలుపు వద్ద మురుగు నీరు వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో తక్షణమే డ్రైనేజీ నిర్మాణానికి చర్యలు చేపట్టాని ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు. అలాగే పొలాల రస్తాలు అభివృద్ధి చేసి రైతులకు ఇబ్బంది లేకుండా చేస్తామన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో పర్యటించే సమయంలో ప్రజలు లేవనెత్తిన ప్రతి సమస్యను మినిట్స్ బుక్‌లో నమోదు చేసుకుని ఆపై సచివాలయ సిబ్బంది, ఆయా శాఖల అధికారుల సమన్వయంతో పరిష్కారం చూపాలని, లేదా పైస్థాయి అధికారులకు ప్రతిపాదనలు పంపాలన్నారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్య నారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, సర్పంచ్ మహ్మద్ షరీఫ్, కో-ఆప్షన్ సభ్యులు జాకీర్ ఉసేన్, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లు జయచంద్రారెడ్డి, ఖాజా ఉసేన్, ఉపేంద్రారెడ్డి, దేవేంద్రారెడ్డి, పాలం చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు గౌడ్, ఎంపీడీఓ దస్తగిరి మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆలమూరులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

సేవా లోపం.. వినియోగదారుల కమిషన్ ఆగ్రహం

● రైతులకు రూ.12.50 లక్షలు 9 శాతం వడ్డీతో చెల్లించాలని ఆదేశం

కర్నూలు (లీగల్): రైతులు కోల్డ్ స్టోరేజ్‌లో నిల్వ చేసిన కందిపప్పును ఇవ్వకుండా వేధింపులకు గురిచేస్తున్న శ్రీలక్ష్మీ వెంకటేశ్వర కోల్డ్ స్టోరేజ్ యాజమాన్యంపై జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. రైతులు నమ్మకంతో ఉంచిన కందిపప్పును మూడేళ్లు గడిచినా ఇవ్వకపోవడం సేవాలోపమేనని స్పష్టం చేసింది. రైతులు నిల్వ చేసిన 571 బ్యాగుల కందిపప్పు విలువ రూ.12.50 లక్షలను 9 శాతం వడ్డీతో చెల్లించాలని ఆదేశించింది. అలాగే మరో రూ.35 వేలు పరిహారం, కోర్టు ఖర్చులకు చెల్లించాలని ఆదేశాల్లో పేర్కొంది. ఈ మేరకు కమిషన్ అధ్యక్షులు కె.కిషోర్‌కుమార్, సభ్యులు ఎస్.నారాయణరెడ్డి, నజీమా కౌసర్‌లతో కూడిన బెంచ్ సోమవారం తీర్పునిచ్చింది. వివరాల్లోకి వెళ్తే... కల్లూరు మండలం పెద్దపాడు ప్రాంతానికి చెందిన వి.పరమేశ్వర్‌రెడ్డితో పాటు మరికొందరు రైతులు నన్నూరు సమీపంలోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వర కోల్డ్ స్టోరేజ్‌లో 571 బస్తాల కందిపప్పును ఫిబ్రవరి 2019 నుంచి 2020 ఫిబ్రవరి వరకు నిల్వ చేయాలని కోల్డ్ స్టోరేజ్ యాజమాన్యంతో ఒప్పందం చేసుకున్నారు. 2020 ఫిబ్రవరిలో తాము నిల్వ చేసిన కందిపప్పు, బస్తాలు ఇవ్వాలని కోరినా కోల్డ్ స్టోరేజ్ యాజమాన్యం స్పందించకపోవడంతో వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు.

ప్రజలే దేశ యజమానులు

కర్నూలు కల్చరల్: ప్రజలే దేశానికి యజమానులని ప్రజాస్వామిక సర్వసత్తాక లౌకిక గణతంత్ర దేశంలో పాలకులు కేవలం కార్పొరేట్ సంస్థల అధిపతులనే యజమానులుగా మార్చారని ప్రముఖ వైద్యులు, జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ బ్రహ్మారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక టీజీవీ కళాక్షేత్రంలో ఆయన రచించిన 'భారత ప్రజలమైన మేము ఈ దేశ యజమానులం' పుస్తకాన్ని కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ అదానీ, అంబానీ లాంటి ధనికులకే దేశంలోని ఆస్తులన్నీ కట్టబెడుతూ సామాన్యులపై రోజురోజుకు పన్నుపోటు పెంచుతున్నారన్నారు. పెట్టుబడి దారులు భారీ స్థాయిలో బ్యాంకు రుణాలు, బకాయిలు చెల్లించాల్సి ఉండగా వాళ్లకే రాయితీలు, మాఫీలు ప్రకటించి సామాన్యులపై ఆ రుణభారాన్ని మోపుతున్నారన్నారు. కార్యక్రమంలో కళా క్షేత్రం ప్రధాన కార్యదర్శి మహమ్మద్ మియ్యా, రచయితలు శేషాద్రిరెడ్డి, ఇనాయతుల్లా, ఎస్‌డీవీ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తిప్పాయిపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం

ఓర్వకల్లు: మండల పరిధిలోని తిప్పాయిపల్లె గ్రామంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శివనాగప్రసాద్ సోమవారం తెలిపారు. కార్యక్రమానికి పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి హాజరై గ్రామంలోని ప్రతి ఇంటికి తిరిగి ప్రజా సమస్యలను తెలుసుకోవడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుకోనున్నారు. మండలస్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

●గాయత్రీదేవిగా అమ్మవారు

సి.బెళగల్: దసరా ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని ఈశ్వరాలయంలో అమ్మవారు సోమవారం భక్తులకు గాయత్రిదేవి రూపంలో దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు నిర్వహించుకున్నారు. దేవతా మూర్తికి అర్చకులు సుదర్శణమాచార్యులు హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కె.నాగులాపురంలో..

గూడూరు రూరల్: దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కె.నాగులాపురం గ్రామంలో కొలువైన గ్రామ దేవత సుంకులా పరమేశ్వరి సోమవారం గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. దసరా ఉత్సవాలు ముగిసేవరకు ప్రతి రోజు అమ్మవారిని వివిధ దేవాతా మూర్తుల అలంకరణ చేయనున్నట్లు ఆలయ అధికారి రాధాకృష్ణ తెలిపారు.

బాలాత్రిపుర సుందరీదేవిగా..

గూడూరు: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని అంబాభవానీ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బాలాత్రిపుర సుందరీ దేవీ అలంకరణలో అమ్మ వారు భక్తులకు దర్శనమిచ్చారు. రాజరాజేశ్వరి ఆలయం, చౌడేశ్వరి అమ్మ వారి ఆలయంలో కూడా అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేశారు.



గాయత్రిదేవికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



గాయత్రిదేవి అలంకరణలో సుంకులా పరమేశ్వరి దేవి



గూడూరులో బాలాత్రిపుర సుందరీదేవి అలంకరణలో అమ్మ వారు



కోడుమూరులో గాయత్రీ దేవి అలంకరణలో వల్లెలాంబదేవి



పాణ్యంలో మహాలక్ష్మీదేవిగా అమ్మవారు



కల్లూరులో గాయత్రి దేవి అలంకరణలో అమ్మవారు

కోడుమూరు రూరల్: పట్టణంలోని వల్లెలాంబదేవి, కన్యకాపరమేశ్వరీ, చౌడేశ్వరీ దేవి, కాళికామాతా, శ్రీరాములమ్మ, తులజా భవాని, అంబా భవాని దేవాలయాల్లో అమ్మవారు గాయత్రీదేవి, బాలత్రిపుర సుందరి దేవిగా బహురూపాల్లో దర్శనమిచ్చారు. సోమవారం రాత్రి వల్లెలాంబదేవి ఆలయంలో పల్లకీ సేవ కార్యక్రమాన్ని భక్తులు కనుల పండువగా నిర్వహించారు. అనంతరం కండెక్టర్ రాజు దంపతులు అమ్మవారి ఆలయ సన్నిధిలో భక్తులకు అన్నదానం చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్ రెడ్డి, స్థానిక నేతలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాణ్యం: మండలంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆలయంలో అమ్మవారు పార్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి మొక్కులు తీర్చుకున్నారన్నారు. అలాగే రైల్వే గేటు వద్ద వెలసిన శ్రీ పెద్దమ్మ వారు అన్నపూర్ణదేవిగా, వాసవీ కన్యాకా పరమేశ్వరి ఆలయంలో వెలసిన అమ్మవారు మహాలక్ష్మీ దేవిగా దర్శమిచ్చారు.

కల్లూరు: కల్లూరులో వెలసిన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అమ్మవారు గాయత్రి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.